వడదెబ్బ ముప్పు.. జాగ్రత్తలతోనే తప్పు

హైరిస్క్ ప్రాంతాల్లో వైద్యారోగ్యశాఖ చర్యలు శూన్యం

ఈనాడు, హైదరాబాద్ : ఎండలు మండిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 42.7 డిగ్రీల వరకు నమోదు అవుతున్నాయి. వడ దెబ్బకు నిత్యం పదుల సంఖ్యలో పిట్టల్లా రాలిపోతున్నారు. రానున్న వారం రోజుల్లో ఎండలు మరింత ముదిరే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. గ్రేటర్వ్యాప్తంగా బస్తీ దవాఖాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ కార్నర్లు ప్రారంభించినట్లు వైద్యారోగ్య శాఖ ప్రకటించినా క్షేత్రస్థాయిలో చర్యలు కనిపించడం లేదు. ముఖ్యంగా హైరిస్క్ కేంద్రాల్లో ఉపశమన చర్యలు తీసుకోవడం లేదు. నిర్మాణ రంగంలో పనిచేసే కూలీలు, కార్మికులు ఎక్కువ సంఖ్యలో పనిచేసే పారిశ్రామికవాడలను హైరిస్క్ ప్రాంతాలుగా గుర్తించారు. శివార్లలో నిర్మాణరంగ కార్మికులు వేల సంఖ్యలో పనిచేస్తున్నారు. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి ప్రాంతాల్లో మారుమూల ప్రాంతాల్లో ఇటుక బట్టీలు, వీబీ - జీ రాం జీ పథకం (ఉపాధి హామీ) పనుల్లో కార్మికులు నిమగ్నమవుతుంటారు. వీరికే ఎక్కువ శాతం వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇక్కడ పనిచేసే కార్మికులపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాల్సిన అవసరముంది. హైరిస్క్ ప్రాంతాల్లో పనిచేసే కూలీలకు సూచనలు అందించటం, ఓఆర్ఎస్ పొట్లాల పంపిణీ తదితర చర్యలు చేపట్టాల్సిన వైద్యారోగ్యశాఖ చేష్టలుడిగి చూస్తోంది.

ఎండలో బయటకు వెళితే.. ఎంత ఎండ ఉన్నా కొందరికి బయటకు వెళ్లక తప్పదు. డెలివరీ బాయ్స్, ఆటోడ్రైవర్లు, కార్మికులు, బయట తిరిగే ఉద్యోగాలు చేసేవారు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. టోపీ, హెల్మెట్ ధరించాలి. కాటన్ దుస్తులకు ప్రాధాన్యమివ్వాలి. వెంట నీళ్ల సీసా, ఓఆర్ఎస్ ద్రావణం, కొబ్బరి నీళ్లు, మజ్జిగ తీసుకెళ్లాలి.

ఉపశమనం పొందండిలా..

● వచ్చే వారం పాటు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అవసరమైతే తప్పా.. ఎండలో తిరగొద్దు. ● ప్రతిఒక్కరూ ఇంట్లో డబ్ల్యూహెచ్వో లేబుల్ ఉన్న ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచుకోవాలి. పీహెచ్సీల్లోనూ ఉచితంగా అందిస్తారు. ● తల తిరగడం, నిస్సత్తువ, నీరసం, జ్వరం, అపస్మారక స్థితి వంటి లక్షణాలు కనిపిస్తే పీహెచ్సీలకు వెళ్లాలి. ● గాంధీ, ఉస్మానియాలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ● ఎండ దెబ్బ తగిలినవారిని తొలుత నీడకు చేర్చి.. గాలి తగిలేలా చేయాలి. శరీరాన్ని చల్లని వస్త్రంతో తుడవాలి. ● తాగడానికి నీళ్లు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఆర్ ద్రావణం అందించాలి.

కనిపించే లక్షణాలివే..

వడదెబ్బకు ముందు నాలుగు దశలు ఉంటాయి. తొలుత శరీరం వేడెక్కినట్లు అనిపిస్తుంది. రెండో దశలో ఎక్కువ దాహంవేసి అలసటగా అనిపిస్తుంది. మూడో దశలో ఎక్కువగా చెమట పట్టడం, తలనొప్పి, నిస్సత్తువ లక్షణాలు కనిపిస్తాయి. నాలుగో దశలో తలతిరగడం, చెమట ఆగిపోవడం, నాలుక తడారిపోవటం లక్షణాలు కన్పిస్తాయి. వెంటనే అప్రమత్తం కాకపోతే అయిదో దశలో వడదెబ్బకు గురయ్యే ప్రమాదముంది. ఎండలో పనిచేసేటప్పుడు చెమట ఎక్కువ పట్టడం, నీరసం, దాహం లక్షణాలు కన్పిస్తే.. వెంటనే పని ఆపేసి నీడకు చేరాలి. చెమట రూపంలో శరీరం నుంచి నీరు, సోడియం, పోటాషియం బయటకు పోతాయి. ఓఆర్ఆర్ ద్రావణం, ఉప్పు, కొంచెం పంచదార, ఉప్పు కలిపిన నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం తీసుకోవడం వల్ల శరీరం మళ్లీ హైడ్రేట్ అవుతుంది.

విశ్వనగరం భాజపాతోనే సాధ్యం

మాట్లాడుతున్న రామచందర్‌రావు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే : విశ్వనగరం భాజపాతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన కూకట్‌పల్లి పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో మూడు కార్పొరేషన్లలో భాజపాను గెలిపిస్తే అవినీతిరహిత పాలన అందిస్తామన్నారు. నీటి కొరత, కరెంటు సమస్య లేని నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. గతంలో కేసీఆర్ జిల్లాల విభజనలో తప్పిదం చేస్తే.. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మజ్లిస్‌కు అనుకూలంగా గ్రేటర్‌ను విభజించి మహా తప్పిదం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం కూకట్‌పల్లి లక్ష్మీనగర్‌లో పలువురు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పారు. కార్యక్రమంలో భాజపా నేతలు మాధవరం కాంతారావు, మల్లారెడ్డి, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ, ఈబీసీ ఉపకార వేతనాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

గన్‌ఫౌండ్రి: హైదరాబాద్ జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి బీసీ, ఈబీసీ విద్యార్థుల ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 31వరకు పొడిగించినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖాధికారి జి.ఆశన్న తెలిపారు. అర్హులైన ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు tg ePASS వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చికెన్ ధరలు				
	ఫారంకోడి	118-00	డ్రెస్డ్	225-00
	రిటైల్	145-00	స్కిన్‌లెస్	254-00

జనగణనను సమర్థంగా చేపట్టాలి

పురానాపూల్‌లో హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న భారతీ హోళికెరి

కేశవగిరి, చాంద్రాయణగుట్ట: జనగణన ప్రక్రియను సమర్థంగా చేపట్టాలని సెన్సెస్ తెలంగాణ డైరెక్టర్ భారతీ హోళికెరి అధికారులను ఆదేశించారు. పురానాపూల్, హుస్సేనీ ఆలం, మొఘల్‌పురా తదితర ప్రాంతాల్లో మంగళవారం చార్మినార్ జోనల్ కమిషనర్ కె.సత్యనారాయణ, ఇతర అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ.. సర్వే జరుగుతున్న తీరును స్థానికులను డిగి తెలుసుకున్నారు. ఏ ఒక్క భవనాన్ని వదిలిపెట్టకుండా ప్రతి గృహానికి సెన్సెస్ ఇంటి నంబరు ఇచ్చి వివరాలు సేకరించాలని సూచించారు. సేకరించిన వివరాలను ఇంటి యజమానికి తెలియజేసి ధ్రువీకరించుకోవాలన్నారు. జనగణనలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని హెచ్చరించారు. జనగణన శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ జ్ఞానేశ్వర్, జాయింట్ డైరెక్టర్లు శ్రీకాంత్, రఘు, చార్మినార్ డీసీ సరిత ఉన్నారు.

సీఎం ప్రజావాణికి 634 దరఖాస్తులు

వినతులు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి, చిత్రంలో ఏసీపీ ఉమేందర్

సోమాజిగూడ: ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 634 దరఖాస్తులు అందాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి - 296, రెవెన్యూ - 48, ఇతర శాఖలు - 107, ఇందిరమ్మ ఇళ్ల కోసం - 181, ప్రవాసి ప్రజావాణికి - 2 చొప్పున దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇన్‌ఛార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఏసీపీ ఉమేందర్, ఎన్ఆర్ఐ సమన్వయ మండలి వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ. కోటి బీమా పరిహారం

రూ.కోటి చెక్‌ను అందజేస్తున్న రవీంద్రబాబు, నాగిరెడ్డి తదితరులు

రాంనగర్, న్యూస్‌టుడే : పికెట్ డిపో డ్రైవర్ శ్రీనివాసరెడ్డి, పరిగి డిపో డ్రైవర్ సుధాకర్ రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందడంతో వారి కుటుంబాలకు టీజీఎస్ ఆర్టీసీ యూనియన్ బ్యాంక్ సహకారంతో రూ.కోటి చొప్పున ఆర్థిక సహాయం అందజేసింది. యూబీఐ సూపర్ శాలరీ సేవింగ్ అకౌంట్‌లో ఉన్న ఉచిత ప్రమాద బీమా పథకం ద్వారా ఈ సాయం అందినట్లు ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి తెలిపారు. మంగళవారం బస్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ రవీంద్రబాబు, రీజనల్ హెడ్ వెంకటేశ్వర్లుతో కలిసి బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేశారు.

లైసెన్స్ పొందిన సర్వేయర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

రాంనగర్: రెవెన్యూ లైసెన్స్ పొందిన సర్వేయర్లకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ రెవెన్యూ లైసెన్స్ పొందిన సర్వేయర్ల సంఘం అధ్యక్షుడు ఎన్.రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం అధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. రమేశ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో 6,500 మంది సర్వేయర్లు ఉన్నారని, సర్వేలో భాగంగా ఎకరాకు రూ.50లు ఇస్తున్నారని తెలిపారు. ఇలా కాకుండా గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సంఘం ప్రధాన కార్యదర్శి కొమ్ము శేఖర్, సభ్యులు శివకుమార్, బాలకృష్ణ, సతీశ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా బంజారాల స్వర్ణోత్సవాలు

మాట్లాడుతున్న రవీందర్‌నాయక్. చిత్రంలో బెల్లయ్య నాయక్, శంకర్ నాయక్, రాములు నాయక్, బలరాంనాయక్ తదితరులు

నారాయణగూడ: దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ బంజారా సమాజానికి రిజర్వేషన్లు కల్పించి యాభై ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా బంజారాల స్వర్ణోత్సవాలు నిర్వహించాలని గిరిజన, లంబాడా నేతలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. 'స్వర్ణోత్సవ' శుభ సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా ఉత్సవాలు, ఇందిరాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యే రాందాస్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మాజీ మంత్రి రవీందర్‌నాయక్, టీజీ ట్రైకార్ ఛైర్మన్ డా. బెల్లయ్యనాయక్, టీపీసీసీ అధికార ప్రతినిధి డి.వెంకన్న నాయక్, జాతీయ నేత అమర్‌సింగ్ పవార్ పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షను గౌరవించే ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు: మంత్రి తుమ్మల

తుమ్మల నాగేశ్వరరావుకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న నవీన్ యాదవ్, చిత్రంలో బండి రమేశ్ తదితరులు

అమీర్‌పేట: అమీర్‌పేట ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్షను గౌరవించే మైత్రీవనం కూడలిలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ తీసుకుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికలో జూబ్లీహిల్స్ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఎన్టీఆర్ జయంతి రోజైన ఈనెల 28న సీఎం రేవంత్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని తెలిపారు. మంగళవారం మైత్రీవనం కూడలిలో ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ఠాపన పనులను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బండి రమేశ్‌లతో కలిసి తుమ్మల పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ.. నీతి, నిబద్ధత, నిజాయతీ కలిగిన ఎన్టీఆర్ వంటి మహానాయకులను స్మరించుకోవడంతో భవిష్యత్ తరాలు, రాజకీయాలు ఆదర్శంగా ఉంటాయన్నారు. కార్యక్రమానికి పెద్దఎత్తున ఎన్టీఆర్ అభిమానాఉలు తరలిరావాలని కోరారు. మంత్రి తుమ్మలకు ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమ ఆహ్వాన పత్రాన్ని నవీన్ యాదవ్ అందజేశారు. స్థానిక నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్‌పై పచ్చదనం కాపాడేందుకు చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

ఈనాడు, హైదరాబాద్: ఔటర్ రింగ్‌రోడ్డుపై పచ్చదనం కాపాడటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు హెచ్ఎండీఏ తెలిపింది. కొన్నిచోట్ల సంఘ విద్రోహ శక్తులు డ్రిప్ పైపులను చోరీ చేయటం వాస్తమేనని, ఆయా చోట్ల మరమ్మతులు చేపట్టి మొక్కలకు నీరిందిస్తున్నట్లు పేర్కొంది. ఓఆర్ఆర్ పొడవునా 158 కిలోమీటర్ల మేర పచ్చదనాన్ని శాస్త్రీయంగా రూపొందించిన డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ ద్వారా నిర్వహిస్తున్నట్లు వివరించింది. ఈ మేరకు 'ఈనాడు'లో 'పచ్చదనం...ఇలాగైతే కనం' అన్న శీర్షికతో ప్రచురితమైన కథనానికి హెచ్ఎండీఏ స్పందించింది. 45డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవటంతో మొక్కలు వాడిపోయినట్లు కన్పిస్తున్నాయని, వాటికి అదనపు నీటి వసతి కల్పిస్తున్నామని తెలిపింది.

భవిష్యత్తు పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు

మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మాదాపూర్: పారిశ్రామిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మాదాపూర్ హైటెక్స్‌లో మంగళవారం తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ పరిధిలోని రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ (రిచ్), కేంద్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ పరిధిలోని హైదరాబాద్ ఎస్ఆండ్‌టీ క్లస్టర్ సంయుక్త ఆధ్వర్యంలో 'తెలంగాణ ఎంఎస్ఎంఈ గ్రీనింగ్ సమిట్' నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి వర్చువల్‌గా హాజరై మాట్లాడారు. 'తెలంగాణ ఎంఎస్ఎంఈ గ్రీనింగ్ పోర్టల్', 'ఎంఎస్ఎంఈ అసెస్‌మెంట్ టూల్ కిట్'ను ఆవిష్కరించారు. డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, రిచ్ సీఈవో రష్మి పింపాలే పాల్గొన్నారు.

మహిళా భద్రతే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి సీతక్క

సఖి కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి సీతక్క, విజయలక్ష్మి, దానం, అనిల్‌కుమార్ యాదవ్

ఫిల్మ్‌నగర్: హైదరాబాద్ నగరానికి వచ్చే మహిళలు భయం లేకుండా జీవించే వాతావరణం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క తెలిపారు. మహిళా సంఘాలు ఏర్పాటుచేస్తున్న సౌర విద్యుత్తు ప్లాంట్లను బుధవారం మధిర నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభిస్తారన్నారు. జూన్ 5న మహిళలకు ఆర్టీసీ బస్సులను సీఎం రేవంత్‌రెడ్డి అందజేస్తారన్నారు. బంజారాహిల్స్ రోడ్ నం.12 మిథిలానగర్‌లో నిర్మించిన వర్కింగ్ ఉమెన్ హాస్టల్ 'సఖి నివాస్'ను, వన్ స్టాప్ సెంటర్ 'సఖి కేంద్రం'ను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఎంపీ అనిల్‌కుమార్, ఎమ్మెల్యే దానం నాగేందర్, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఛైల్డ్‌రైట్స్ కమిషన్ ఛైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో పండ్ల మార్కెట్ నిర్మాణం

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

మార్కెట్ స్థల పరిశీలనలో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డి, సీపీ సుమతి

తుర్కయంజాల్: రాష్ట్రానికి మణిహారంగా కోహెడ పండ్లమార్కెట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో ప్రభుత్వ సర్వే సంఖ్య 167/1లోని మార్కెట్ స్థలాన్ని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మల్కాజిగిరి సీపీ సుమతిలతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. మార్కెట్‌కు కేటాయించిన భూములు 2007 నుంచి ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. నిజమైన లబ్దిదారులుంటే పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. వచ్చే నెల 3న మార్కెట్ పనులకు సీఎం శంకుస్థాపన చేశాక అక్కడే బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

2న ఉద్యోగ ప్రకటన ఇవ్వాలి: ఎంపీ ఆర్.కృష్ణయ్య

మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో సంఘాల నేతలు

నల్లకుంట: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ దిశగా ప్రకటన చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ ప్రజా ప్రతినిధులను అడ్డుకోవడం, క్యాంపు కార్యాలయాల ముట్టడి చేపట్టేందుకు నిరుద్యోగ యువత సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మంగళవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన నిరుద్యోగ, విద్యార్థి, బీసీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ నిరుద్యోగ ఐకాస ఛైర్మన్ నీల వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజేందర్, అంజిగౌడ్, నిఖిల్‌పటేల్, భీమ్‌రాజ్, ఇందు, బాలయ్య పాల్గొన్నారు.

దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలులో రూ.కోటికి పైగా నగదు స్వాధీనం

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలులో రూ.కోటికి పైగా నగదును తరలిస్తున్న వ్యక్తిని మంగళవారం మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌లో సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముంబై నుంచి హైదరాబాద్‌కు నగదు తీసుకొస్తున్న ట్రాన్స్‌పోర్టర్‌ను గుర్తించి తనిఖీలు చేయడంతో నగదు వెలుగుచూసింది. పోలీసుల ప్రాథమిక విచారణలో ముంబైలోని ఓ బంగారం వ్యాపారి నుంచి హైదరాబాద్‌లో ఉన్న మరో వ్యాపారికి అప్పగించేందుకు ఈ నగదును తీసుకొస్తున్నట్లు తేలింది. నగదు రవాణాకు సంబంధించిన పత్రాలు, అనుమతులపై పోలీసులు ఆరా తీస్తున్నారు. స్వాధీనం చేసుకున్న నగదును ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

నిఫ్ట్ విద్యార్థుల సృజన భళా!

ఆకట్టుకున్న ప్రాజెక్ట్ షోకేస్ ప్రదర్శన

రాయదుర్గం: సరికొత్త వస్త్ర, చేనేత ఉత్పత్తులు, బ్యాగులు, ఆభరణాలకు మాదాపూర్ నిఫ్ట్ విద్యార్థుల 'గ్రాడ్యుయేషన్ ప్రాజెక్ట్ షోకేస్-2026' వేదికగా నిలిచింది. జేఆర్‌సీ కన్వెన్షన్‌లో మంగళవారం డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులు.. తమ ఉత్పత్తులతో స్టాళ్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఫ్యాషన్‌షో నిర్వహించారు.

ఫ్యాషన్ షో ప్రారంభోత్సవంలో పూర్వ విద్యార్థిని సుస్మిత, జయేశ్ రంజన్

వారణాసి నగర స్ఫూర్తితో.. టెక్స్‌టైల్ డిజైన్ విద్యార్థిని బబ్లీ జైస్వాల్.. వారణాసి స్ఫూర్తితో సృజించిన వాల్ ప్యానల్స్ ఆకట్టుకున్నాయి. విశ్వనాథ ఆలయాన్ని చేనేతవస్త్రంపై తీర్చిదిద్ది, దాన్ని కలప ఫ్రేమ్‌లో బిగించారు. ఫ్రేమ్ వెనక సెన్సర్లతో సంగీత పరికరాలు ఏర్పాటుచేశారు. వస్త్రంపై ఉన్న బొమ్మలను తాకగానే సంగీతం వినిపిస్తుంది.

చేనేత కళకు జీవం.. నగరానికి చెందిన రక్షారెడ్డి కనుమరుగైన చేనేత కళకు ప్రాణం పోశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా శాయంపేటలో ప్రత్యేక చేనేత చీరలను నేసే వారని, పదేళ్ల క్రితం ఆ పనులు ఆపేశారని తెలిపారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని 'మళ్లీ' పేరిట తిరిగి ఆ చీరలకు జీవం పోసినట్లు చెప్పారు.

కనిపించని హరితం.. పట్టించుకోని ఫలితం

నల్లకుంట ప్రధాన రహదారిపై ప్రభుత్వ ఫీవర్ ఆసుపత్రి సమీపంలో బ్రిడ్జికి ఇరువైపులా వర్టికల్ గార్డెన్ ఏర్పాటు చేసి మొక్కలు పెంచారు. నిర్వహణ మరవటంతో మొక్కలన్నీ ఎండిపోయాయి. నీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన డ్రిప్‌పైపులు మాత్రమే ఇలా మిగిలాయి.

ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై ప్రైవేటు బస్సు దగ్ధం

కాలిపోతున్న బస్సు

హయత్‌నగర్, న్యూస్‌టుడే: ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై ఓ ప్రైవేటు వోల్వో బస్సు దగ్ధమైన ఘటన పెద్దఅంబర్‌పేట పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి పెద్దఅంబర్‌పేట్‌లోని టాటా సర్వీస్ సెంటర్‌కు ఓ వోల్వో బస్సును మరమ్మతుల కోసం తీసుకొస్తున్నారు. మార్గమధ్యలో బస్సు వెనుక భాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే బస్సును పక్కకు ఆపి.. క్లినర్ సహా కిందకు దిగిపోయారు. చూస్తుండగా మంటలు వ్యాపించి వెనుక భాగం పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటల్ని అదుపులోకి తెచ్చారు. బస్సు ఇంజిన్ వెనుక భాగంలోనే ఉండడంతో షార్ట్‌సర్క్యూట్ కారణంగానే మంటలు అంటుకున్నాయని భావిస్తున్నట్లు అగ్నిమాపక అధికారి యాదగిరి తెలిపారు.

ముదిరాజులను బీసీ 'ఏ'లో చేర్చాలి: ఈటల

మాట్లాడుతున్న ఈటల రాజేందర్, చిత్రంలో బండ ప్రకాశ్, చిరంజీవులు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ముదిరాజులను బీసీ 'డి' నుంచి బీసీ 'ఏ'లోకి చేర్చాలని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని నెక్లెస్ రోడ్డులో ఉన్న జలవిహార్‌లో ముదిరాజు విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ముదిరాజు సింహవలోకనం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈటల మాట్లాడుతూ.. 'ఉమ్మడి రాష్ట్ర సీఎంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉన్నప్పుడు అనేకసార్లు ముదిరాజులను బీసీ ఏలోకి చేర్చాలని అసెంబ్లీలో ప్రస్తావించాను. 2008లో ఉప ఎన్నికలప్పుడు రాజశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అంది నట్టే అంది దూరమైంది. బీసీ 'డి' నుంచి బీసీ 'ఏ' అనే ప్రక్రియ ఒకసారి అమలై ఆగిపోయింది దాన్ని మళ్లీ పరిశీలించి సంపూర్ణంగా అమలు చేయాల్సి అవసరం ఉంది. సీజనువారీగా పండ్లు, కూరగాయలు అమ్ముకొని రెక్కల కష్టం నమ్ముకుని బతికే వాళ్లే ముదిరాజ్‌లు. తెలంగాణ జనాభాలో 26 లక్షల మంది ముదిరాజులున్నారు. మేము ఏ కులాన్ని, వర్గాన్ని ద్వేషించడం లేదు.. ప్రజాస్వామ్య వ్యవస్థలో మాకు సరైన వాటా దక్కాలని కోరుతున్నాం' అని అన్నారు. తెలంగాణ శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాశ్ మాట్లాడుతూ.. బీసీ కమిషన్ సరైన వివరాలు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బీసీ జాబితాలో చేర్చాలని కోరారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, ప్రొఫెసర్ దినేష్, డాక్టర్ శివకేశవ్, ఉప్పరి నారాయణ, జగన్, ముదిరాజుల విద్యార్థుల వేదిక కన్వీనర్ జూలు నాగేశ్వర్ తదితరులు మాట్లాడారు. ముదిరాజ్ సంఘాల నాయకులు, విద్యావంతులు పాల్గొన్నారు.

ఫారం నెం. 14

(రెగ్యులేషన్ 33(2)ను చూడండి)

రిజిస్ట్రర్డు ఎ/డి ద్వారా, దస్తి విఫలమైనందున ప్రచురణ ద్వారా.